ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 27 ఆగస్టు 2025



విద్యార్థులకు బ్రాండెడ్ సైకిళ్లు అందజేస్తున్నాం..

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

వేములవాడ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు తాము అందించే సైకిళ్లు బతుకమ్మ చీరల్లా ఉండవని, బ్రాండెడ్ సైకిళ్లను అందిస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి చదివే విద్యార్థులకు మోదీ కానుక పేరుతో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 150రోజులు 1600కిలోమీటర్లు ప్రజా సంగ్రామయాత్రలో భాగంగా పాదయాత్ర చేపట్టారు. యాత్రలో భాగంగా నిర్మల్ జిల్లా ఓ గ్రామం తిరుగుతున్న సమయంలో ఓ బాలున్ని ఎం చదువుతున్నావని అడిగితే స్కూల్‌కు వెళ్లడం లేదని, తన స్నేహితులకు అందరికి సైకిళ్లు ఉన్నాయని తనకు సైకిల్ లేదని చెప్పాడన్నారు. వెంటనే సైకిల్ కొనుగోలు చేసి అందజేయగా బాలుడు స్కూల్‌కు వెళుతున్నాడన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించుకుని మోదీ కానుక పేరుతో సైకిళ్లు పంపిణీ చేస్తున్నాట్లు చెప్పారు. తాను ఎంపీగా పోటీ చేస్తే వేములవాడ నియోజకవర్గంలోనే ఎక్కువ ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. తాను శిశు మందిర్ స్కూల్లో చదివనాని, తనది పేద కుటుంబమే అనేక ఇబ్బందులను చూసానని, తన నాన్న కష్టంతో చదివించాడని గుర్తు చేసుకున్నారు. పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతోనే సైకిళ్ల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటారని, కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో చదువుకొంటారని ఆరోపించారు. తాను ప్రైవేటు స్కూళ్లకు వ్యతిరేకం కాదని తెలిపారు. గత ప్రభుత్వం విద్యా కోసం రూ. 68 వేల కోట్లు ఖర్చుచేస్తే వెదీ ప్రభుత్వం లక్ష కోట్లు కేటాయించిందన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని, విద్యార్థులు తలదించుకుని చదివితే తల ఎత్తుకుని చూసే రోజులు వస్తాయని సూచించారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు ప్రతి విద్యార్థి కండ్లల్లో మెదలాలని, తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు తెలిస్తేనే ఉన్నతంగా రాణించగలరన్నారు. ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ చదువుకునేందుకు అనేక కష్టాలు పడ్డారని, సమాజానికి భయపడకుండా ఒక లక్ష్యంతో పని చేశారని, హేళన చేసిన పట్టించుకోకుండా ముందుకు సాగిపోయి గొప్ప విద్యావంతుడుగా రాజ్యాంగాన్ని తయారుచేశారని వివరించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్, ఏఎస్పీ శాషాద్రినిరెడ్డి, ఆర్డీవో రాధాబాయి, బీజేపి జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ వికాస్‌రావు తదితరులు ఉన్నారు.

రావయ్యా.. గణపయ్యా..



వినాయక ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- సామాన్యులకు విగ్రహాల భారం
- ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ
- విభిన్నంగా మండపాలు సిద్ధం
- నేటి నుంచి గణనాథుడి ఉత్సవాలు
- జిల్లాలో 5వేలకు పైగా విగ్రహాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆది దేవుడు... సర్వ విఘ్నాలను తొలగించే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడానికి భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గణేష్ ఉత్సవాల సందడి మొదలైంది. తొలిపూజలు అందుకునే గణపయ్యను కొలువుదీరేలా సర్వాంగ సుందరంగా మండపాలను సిద్ధం చేశారు. పట్టణాల నుంచి పల్లెల వరకు.. చౌరస్తాల నుంచి గల్లీల వరకు తొమ్మిది రోజుల పాటు వినాయక సంబురాలతో భక్తులు తన్మయత్వం చెందనున్నారు. బుధవారం ప్రారంభమయ్యే వినాయక సందడికి పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ముందుకు రావడంతో ఆశావహుల సహకారంతో మరింత జోరుగా, ఉత్సాహంగా యువకులు వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. నిర్వాహకులు ఉత్సవాల కోసం ఖరీదైన మండపాలు, భారీ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. విఘ్నాలు తొలగించే వాడిగా ఏ పని మొదలుపెట్టినా విఘ్నేశ్వరున్ని ధ్యానించడంతోనే మొదలయ్యే సంప్రదాయం భూలోకంలేనే కాదు.. దేవలోకంలోనూ ఉంది. వేదాలకు అది స్వరూపమైన ఓంకార రూపమే గణపతిగా భావిస్తారు. పంచభూతాలకు సంకేతంగా వినాయకుడు పూజలు అందుకుంటాడు. దక్షిణాయానంలో తొలి పండుగగా వినాయక చవితిని అన్ని కులాలు, ఉత్సవాలను జరుపుకుంటారు.

పూజకు ఇలా సిద్ధం కావాలి..

- చవితి రోజు తెల్లవారుజామునే లేచి స్నానం చేసి పట్టు వస్త్రాలు, నూతన వస్త్రాలు ధరించాలి.
- గడపలకు పసుపు, కుంకుమలు, గుమ్మాలకు మంగళ తోరణాలు కట్టాలి.
- మట్టితో వినాయక విగ్రహాన్ని తయారుచేసుకొని పూజకు సిద్ధం చేసుకోవాలి.
- వినాయకుని పూజ కోసం 21పత్రులను సిద్ధం చేసుకోవాలి. వాటితో పాటు పసుపు, కుంకుమ, అగర్‌వత్తులు, హారతి కర్పూరం, అక్షింతలు, దీపస్తంభాలు, కందులు, వత్తులు, నూనె లేక నెయ్యి, పంచామృతాలు, తమలపాకులు, వక్కలు, పూజ పుష్పాలు, పండ్లు, పత్రి, వ్రతం, యజ్ఞోపవితం, గంధం, పంచపాత్ర, ఉద్దరీన, పల్లెములు, హారతిపల్లెం, కొబ్బరికాయలు, జేగంట, పాలవెల్లి, గొడుగు, నైవేద్యం సామగ్రి, పిండివంటలు సిద్ధం చేసుకోవాలి.
- ఇంటిలోనే ఈశన్య ప్రాంతంలో తూర్పు ముఖంగా శుభ్రం చేసి అలికి ముగ్గులు పెట్టాలి. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఉపయోగించే పీఠాన్ని లేదా మండపాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించాలి.
- మండపంలో అష్టదల పద్మముగ్గు వేయాలి. వెదురు కర్రలతో పాలవెల్లి తయారు చేసి, వెలగ, మారేడు, మొక్కజొన్న కంకులు, జామ పండ్లు, అరటిపండ్లు, మామిడి ఆకులు, పూలతో పాలవెల్లిని అలంకరించాలి.
- అష్టదల పద్మంలో బియ్యం పోసి వినాయకున్ని ప్రతిష్ఠించాలి. దీపాన్ని వెలిగించాలి. అక్షింతలు ఉంచి కలశ పూజ చేయాలి. పసుపుతో చేసిన గణపతిని తమలపాకుపై ఉంచి పూజ చేయాలి.
- లోహవిగ్రహాలు ఉన్నా మట్టి విగ్రహన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఏర్పాటు చేసుకున్న సామగ్రితో పూజ నిర్వహించాలి.

బొజ్జ గణపయ్య ఖర్చు రూ.10 కోట్లపైనే..

జిల్లా వ్యాప్తంగా లంబోధరుడికి స్వాగతం పలకడానికి, ఘనంగా ఉత్సవాలు నిర్వహించడానికి బొజ్జ గణపయ్య ఖర్చు భారీగానే ఉంది. జిల్లాలో దాదాపు ఐదు వేల భారీ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఇందుకోసం రూ.10 కోట్ల పైగానే నిర్వాహకులు ఖర్చు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడల్లోనే 3 వేల విగ్రహాల వరకు ప్రతిష్ఠిస్తే, ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది వరకు ప్రతిష్ఠిస్తారు. విగ్రహాల కోసం సంఘాలు రూ.45వేల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మండపాల కోసం అదనపు ఖర్చు కూడా ఉంటుంది. మహారాష్ట్ర, నాందేడ్‌తో పాటు హైదరాబాద్, ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకవస్తున్నారు. మట్టి విగ్రహాలను కూడా ఏర్పాటుకు పూనుకున్నారు. ఈసారి 10 శాతం వరకు ధరలు కూడా పెరిగాయి. ఇళ్లలో పూజలు నిర్వహించుకోవడానికి చిన్న విగ్రహాల అమ్మకాలు కూడా మార్కెట్‌లో మొదలయ్యాయి. వివిధ ఆకృతుల్లో ఉండే చిన్న విగ్రహాలు రూ.300 నుంచి రూ.2 వేల వరకు ధర పలుకుతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

ఉత్సవాలపై పోలీస్ నజర్

జిల్లాలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. రాత్రి పది గంటల తరువాత సౌండ్ సిస్టమ్‌ను నిలిపివేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. మండపాల వివరాలను

మిగతా 8లో

ధార్మిక, కార్మిక క్షేత్రంగా జిల్లా అభివృద్ధి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ధార్మిక కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో కే కన్వెన్షన్ హాల్లో నేతన్న పొదుపు(త్రిఫ్ట్), నేతన్న బీమా పథకాల చెక్కులను వ్యవసాయ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేత కార్మికుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందన్నారు. వస్త్ర పరిశ్రమలో రూ.352 కోట్ల బకాయిలను రేవంత్ సర్కార్ చెల్లించిందని అన్నారు. చేనేత కార్మికులకు పని కల్పించాలనే లక్ష్యంతో రూ 270 కోట్ల విలువగల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం అందించిందని వెల్లడించారు. చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల ఆర్డర్లను ఇప్పిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద ఉత్పత్తి చేసే ఆర్డర్లతో ఒక్కో కార్మికుడికి నెలకు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు ఆదాయం వస్తుందని వివరించారు. ఆర్డర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ నేతన్న పొదుపు(త్రిఫ్ట్) పథకం కింద జిల్లాకు చెందిన 4963 మంది వస్త్ర పరిశ్రమ కార్మికులకు రూ 24.80 కోట్లు, నేతన్న బీమా ఉండి మరణించిన 12 చేనేత కార్మికుల కుటుంబాలకు రూ 5 లక్షల చొప్పున పరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ కింద రుణాలు రెన్యువల్ చేస్తున్నామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ చీరల ఉత్పత్తి బకాయిలు దాదాపు రూ 250కోట్ల రూపాయలను ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. స్వశక్తి మహిళా సంఘాలోని మహిళలకు రెండు నాణ్యమైన చీరలు అందించాలని నిర్ణయించి, ఆ చీరల ఉత్పత్తి ఆర్డర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కేటాయించామన్నారు. వేములవాడలో రూ 50 కోట్లతో నూలు డిపో ఏర్పాటు చేశామన్నారు. నేతన్న పొదుపు, నేతన్న బీమా, నేతన్నలకు లక్ష రూపాయల రుణ మాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి గీతే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, చేనేత జౌళి శాఖ జేడీ ఎన్వీరావు, ఏడీ రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, నేత కార్మికులు, ఆసాములు ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



త్రిఫ్ట్ చెక్కును అందిస్తున్న మంత్రులు, విప్

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

- రికార్డులు, మందుల నిల్వల పరిశీలన

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత తనిఖీ చేశారు. పీహెచ్‌సిలో రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించి జ్వరాల నివారణలో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ యాంటీ లార్వాలను తొలగించి జ్వరాల బారిన పడ్డ వారి రక్త నమూలను సేకారించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే డెంగ్యూ నివారణలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని సందర్శించి జ్వర పీడితుల రక్త నమూలను సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత తదితరలు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు ఎదుట కార్మికుల ధర్నా 8

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై కొంతమంది దుండగులు దాడిచేసి తీవ్రంగా గాయపరచడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించి దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 8నెలల క్రితమే న్యాయవాదుల రక్షణ చట్టంకు సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు సిద్ధమైనప్పటికీ ఇప్పటివరకు శాసనసభలో ప్రవేశపెట్టలేదన్నారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను భావితరాలకు తెలియజేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - సిరిసిల్లలో పూలే దంపతుల విగ్రహావిష్కరణ



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మహత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామని, మహనీయుల ఆశయాలను ముందు తరాలకు తెలిసేలా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. జిల్లాకు వచ్చిన చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు వివిధ సంఘాల నాయకులు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా విగ్రహావిష్కరణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ విచక్షణ వెట్టి చాకిరి తొలగించాలని, ఈ సమాజంలోని పేద బిడ్డలు ముందుకు పోవాలని అన్ని అసమానతలు పోవాలని పోరాటం చేశారన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన రూపుమాపి ఆడపిల్లలకు చదువే ఆయుధం అని అనేక పాఠశాలలు నెలకొల్పి విద్యను అందించిన మహనీయులని అన్నారు. ఆదర్శ దంపతులు విగ్రహాలు గ్రంథాలయం ముందు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మహత్మా జ్యోతిబాపూలే జీవిత కథ ఆధారంగా నిర్మించిన సినిమాను చూడటం జరిగిందన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కే కే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు అక్షర జ్ఞానాన్ని జ్యోతిబాపూలే దంపతులను అదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారా యణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప తిరుపతిరెడ్డి, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కల రాము, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్ప దండి ప్రకాష్, ఏఐసీసీ కార్యవర్గ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, విగ్రహదాత మోతే బాబు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బీసీ సంఘం అధ్యక్షుడు పర్ష హనుమండ్లు,మున్నూరుకాపు జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోరి వెంకటరమణ, ముదిరాజ్ సంగం అధ్యక్షుడు వంకాయల కార్తి,విగ్రహ కమిటీ సమన్వయకర్త గడ్డం నర్సయ్య, సభ్యులు బొజ్జ కనకయ్య అంకని భాను, కర్నాల భద్రాచలం, రామచంద్రం, రాగుల రాములు, మల్లేశం, వెంకన్న గంగాధర్, కల్లూరి చందన, సూర దేవరాజు, సుంక నాగరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు బెదిరింపులు

● పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్




పోలీస్‌స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌కు గుర్తుతెలియని వ్యక్తి (9440473303) ఫోన్ చేసి చంపుతామని బెదిరించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాకకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నల్ల సతీష్ మంగళవారం తన ఆటో నడుపుకుంటూ కరీంనగర్‌కు వస్తున్నాడు. కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద కొందరు ఆటోను నిలిపి సతీష్‌పై దాడి చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతావా? అంటూ ఆగ్రహంతో కొట్టారు. మళ్లీ అలాంటి పోస్టులు పెడితే చంపుతామని బెదిరించారు. ఈ ఘటన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ బాధితుడిని కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. లిఫ్ట్ చేయగానే 'నీవు బీఆర్ఎస్ కార్యకర్త సతీష్‌ను తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్తావా? నీవు చొప్పదండి నియోజకవర్గంలోని ఊర్లలో తిరిగితే చంపుతాం. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మీడియాలో తిడితే బతుకనీయం' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై సుంకె రవిశంకర్ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడారు. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోదరుడినని, ఏ గ్రామానికీ వెళ్లనీయబోమని, దాడి చేసి చంపుతామని బెదిరించి నట్లు చెప్పారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడిగా నల్ల సతీష్ చురుకుగా ఉన్నందుననే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. సతీష్‌పై దాడి చేసినవారిపైనా, తనకు ఫోన్ చేసి చంపు తానని బెదిరించినవారిపైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నామని సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు ఉన్నారు.

కంప్యూటర్ కోర్సు.. భవితకు ఉషస్సు

- ఈ ఏడాది నుంచే కేజీబీవీల్లో ఇంటర్ స్థాయిలో ప్రారంభం
- వృత్తి విద్యతో ఉపాధి, ఉద్యోగాలకు అవకాశం



కంప్యూటర్‌పై ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిజిటలైజేషన్, గ్లోబలైజేషన్ పరిస్థితుల్లో బాలికలకు ఇంటర్ స్థాయిలోనే కంప్యూటర్ సైన్స్‌లో నైపుణ్యం పెంచి స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పనకు అవకాశం ఇచ్చేందుకు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు పాఠశాల



కస్తూర్బాగాంధీ విద్యాలయం

స్థాయిలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఇంటర్మీడియేట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ వాటిలో వొకేషనల్ కోర్సులను 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ బోర్డు అమలు చేయాలని నిర్ణయించింది. బాలికలకు రెండేళ్ల కాలపరిమితితో కంప్యూటర్ కోర్సులపై పట్టు సాధించేలా సిలబస్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కోర్సు పూర్తి కాగానే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

● ఐదు మండలాల ఎంపిక

బాలికల్లో కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను పెంచడానికి జిల్లాలో ప్రభుత్వం కథలాపూర్, మేడిపల్లి, ధర్మపురి, మల్లాపూర్, మల్యాల మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. ఇంగ్లీష్ సబ్జెక్ట్‌తో పాటు కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలతో సిలబస్ రూపొందించి ఒక్కో పాఠశాలకు 40 మందిని చేర్చుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఇంగ్లీష్, కంప్యూటర్ బోధనకు ఉపాధ్యాయులను కూడా నియమించారు. ఏడు కంప్యూటర్లు, ఫర్నిచర్ సరఫరా చేసి బోధన చేస్తున్నారు. కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, ఎంఎస్ ఆఫీస్, వెబ్ డిజైనింగ్, డాటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టం, డాటా కమ్యూనికేషన్, కంప్యూటర్ నెట్‌వర్క్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సీ ప్లస్, జావా, ఎక్స్‌ఎల్ వంటివి విద్యార్థినులకు నేర్పిస్తున్నారు. ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేసి కంప్యూటర్‌పై ప్రాక్టికల్‌గా నేర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. రాబోయే ఏళ్లలో డిజిటల్ ప్లాట్‌ఫాంలో గ్రాఫిక్, యానిమేషన్, కాన్ఫిగరింగ్ సిస్టమ్, ప్రింటింగ్ మరియు పబ్లిషింగ్, డిజైనింగ్‌లో సాంకేతికత పెరగడానికి దోహదం చేయనుంది. ఇంటర్‌నెట్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో పుష్కలంగా నైపుణ్యాలు పెంచుకునేందుకు అవకాశం చిక్కనుంది. ప్రభుత్వ విభాగంలో జూనియర్ ప్రోగ్రామర్, కంప్యూటర్ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ పర్సనల్, నెట్‌వర్కింగ్ టెక్నీషియన్స్ పోస్టులు, స్వయం ఉపాధిలో డీటీపీ ఆపరేటర్, ఇంటర్‌నెట్, ఈమెయిల్ సెంటర్స్, ఇమేజ్ అండ్ వీడియో ఎడిటింగ్, హార్డ్‌వేర్, ట్రబుల్ షూటింగ్ టెక్నీషియన్స్, డాటాబేస్ నిర్వాహణ, నెట్‌వర్క్ కనెక్షన్స్ వంటివి ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉండనుంది.

కోర్సుపై ఆసక్తితో చేరాను

- శృతి, విద్యార్థిని



కంప్యూటర్ కోర్సులో చేరాలనే ఆసక్తి ఎప్పటి నుంచో ఉంది. అయితే ప్రభుత్వం కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి కంప్యూటర్ కోర్సు ప్రవేశపెడుతుందని తెలిసి అడ్మిషన్ తీసుకున్నా. వర్డ్, ఎక్స్‌ఎల్, జావా, వెబ్ డిజైనింగ్ వంటి అంశాలను ఇప్పటికే ల్యాబ్‌లో ప్రాక్టికల్‌గా నేర్చుకున్నాం. అన్నిరంగాల్లో కంప్యూటర్ సాధారణమైన నేపథ్యంలో భవిష్యత్ బాగుంటుందని తల్లిదండ్రులు, బంధువులు చెప్పారు.

రాబోయే రోజుల్లో భారీ డిమాండ్

- వాసాల లావణ్య, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ



రానున్న రోజుల్లో కంప్యూటర్ ప్రొఫెషనల్స్‌కు భారీ డిమాండ్ ఉండనున్న నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన సీఎస్‌సీ కోర్సు బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్‌స్థాయిలో ప్రవేశపెట్టిన ఈ కోర్సుతో కంప్యూటర్ సైన్స్‌పై నిష్ణాతులు కావడానికి ఆస్కారం ఉంది. వొకేషనల్ విభాగం రూపొందించిన సిలబస్‌తో అనేక అంశాలపై పట్టు సాధించనున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

మానకొండూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులోని బ్రిడ్జిపై మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు చెడిపోవడంతో మరమ్మతుల కోసం హుజూరాబాద్ వైపు నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా బస్సును కరీంనగర్ నుంచి వరంగల్ వైపుకు వెల్లుతున్న లారీ బ్రిడ్జిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనకాల ధ్వంసమైంది. బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి గ్రామానికి చెందిన రైతు గడ్డి లింగయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తో సోమవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామ శివారులోకి ఎద్దును మేతకు తీసుకు వెళ్ళగా ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు లింగయ్య కోరాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు.

రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలు

మల్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కొండగట్టుకు చెందిన రంగు నర్సింహులు తన భార్యతో కలిసి హైదరాబాద్ నుంచి వస్తుండగా జగిత్యాల నుంచి వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులోని నర్సింహులు, విజయ, జగిత్యాల కు చెందిన అడువాల లక్ష్మణ్‌తో పాటు మరొకరికి గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పట్టుకున్న పోలీసులు మంగళవారం వాటిని యజమానులకు అప్పగించారు. కరీంనగర్‌కు చెందిన అల్లాడి విజయ్, వై.మల్లారెడ్డి కొద్ది రోజుల కిందట ఫోన్‌లు పోగొట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఫోన్‌లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి యజమానులకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో కార్మికుడి ఆత్మహత్య



వేముల కరుణాకర్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన వేముల కరుణాకర్(42)అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పురుగుల మందు తాగి వచ్చి ఉదయం ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న కరుణాకర్‌ను చూసిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కరుణాకర్ మృతిచెందడాని తెలిపారు. కాగా మృతుడు తన భార్యతో గొడవపడి నాలుగు సంవత్సరాలుగా ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుతురు, కుమారుడు ఉన్నారు.

స్వశక్తి మహిళలకు నాణ్యమైన చీరలు

- త్వరలో నేత కార్మికులకు రూ. 33 కోట్ల రుణమాఫీ
- విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ సానుకూల నిర్ణయం
- చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సిరిసిల్లలో నేతన్నలకు త్రిఫ్ట్, బీమా చెక్కుల పంపిణీ
- స్వశక్తి చీర ఆవిష్కరణ

సిరిసిల్ల ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మహిళలకు గౌరవంగాఉండేలా నాణ్యమైన చీరలు తయారు చేయాలని ఒక్క చీరపై రూ 480 ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యు లకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు తెలిపారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కే కన్వెన్షన్ హాల్లో నేతన్న పొదుపు(త్రిఫ్ట్), నేతన్న బీమా పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఇదే సందర్భంలో దసరాకు స్వ శక్తి మహిళలకు అందించే ఏకరూప చీరలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జౌళి శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజా రామయ్యార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో నేతకార్మికుల పేరు చెప్పి పనికి రాని చీరలు ఎక్కడెక్కడి నుంచో వచ్చా యన్నారు. అలా కాకుండా మహిళలు పెట్టెలో దాచుకొని వాడుకొనే విధంగా నాణ్యమైన చీరలు అందిస్తామన్నారు. రైతు లకు రుణమాఫీ చేసినట్లే నేత కార్మికుల రుణాలను క్యాబినెట్‌లో చర్చించి త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. నేతన్నలకు సంబం ధించి రుణమాఫీ చేయడానికి నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఈ మేరకు రూ.33 కోట్ల రుణాలు ఉన్నట్లు లెక్కలు తేలాయని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో కార్మికులకు ఖర్చుపెట్టి బాకీ పడ్డ రూ వెయ్యి కోట్లు విడతలవారీగా తీర్చామన్నారు. కార్మికులు కోరినట్లు క్యాబినెట్లో చర్చించి రూ 33 కోట్ల రుణమాఫీ చేసే బాధ్యత తమది అని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గతంలో ఏం జరిగిందో.. ఇప్పుడు ఏం జరుగుతుందో గమనించాలన్నారు. ఈ నియోజక వర్గ ఎమ్మెల్యే పదేళ్ల పరిశ్రమలు, చేనేత జౌళి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చెల్లించకపోయిన బకాయిలు చెల్లించామని, ఇప్పుడు విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ కోసం ఉత్తరం రాశాడన్నారు. క్యాబినెట్లో చర్చించి బ్యాక్ బిల్లింగ్‌పై పరిశ్రమకు సహకారం అందే విధంగా సానుకూల నిర్ణయం చేస్తామని హామీ ఇచ్చారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2500 మెట్రిక్ టన్నుల నూలు 100 సొసైటీలకు సరఫరా చేశామని వెల్లడించారు. నేతన్న చేయూత, నేతన్న పొదుపు, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలను జమ చేస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత ప్రయాణానికి రూ 6680 కోట్ల చెల్లించిందని, మహిళలకు 200 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామన్నారు. వస్త్ర పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ (ఐఐహెచ్‌టి) ఏర్పాటు చేశామని అన్నారు.



స్వశక్తి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కవ్వంపల్లికి బండి సంజయ్ పరామర్శ



నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే రెండో సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించారు. మంగళవారం కరీంనగర్ వాల్మీకినగర్‌లోని నివాసంలో పలువురు నాయకులు కవ్వంపల్లిని కలిశారు. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్‌గౌడ్, టీడీపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి ఉన్నారు.

ఒంటరితనంతో వృద్ధుడి ఆత్మహత్య

చందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్ల లస్మయ్య(80) అనే వృద్ధుడు ఒంటరితనం భరించలేక మండల కేంద్రం శివారులోని ఓ రైతుకు చెందిన గుడిసెలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గత కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న లస్మయ్య కొంత కాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఓ రైతు పొలం వద్దకు వెళ్లేసరికి ఉరి వేసుకుని కనిపించాడు. సదరు రైతు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు.

మహిళ అదృశ్యం

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామానికి చెందిన అంకం పూజ(25) అదృశ్యమైంది. ఈ నెల 13వ తేదీ నుంచి పూజ కనిపించకుండా పోయిందని తల్లి అంకం రమ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూజకు బద్దనపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌తో మూడు సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. ఈ నెల 3వ తేదిన తంగళ్లపల్లిలోని తల్లి గారింటికి వచ్చిన పూజ 13వ తేదీ నుంచి పూజ కనిపించకుండా పోయిందని, ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేణికుంటలో గల మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా కొత్తపల్లి గ్రామానికి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఎల్ఎండి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు చెందిన బోయిని తిరుపతి, బుర్ర అంజయ్య ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండలం శివారులోని గొల్లపల్లి వాగు నుంచి అనుమతి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ దర్శనాల మల్లేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

తప్పుడు డాక్యుమెంట్లతో స్థలం కాజేసే యత్నం

● ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తప్పుడు డాక్యుమెంట్లతో కరీంనగర్‌లోని రాఘవేంద్ర నగర్‌లో స్థలాన్ని కాజేయాలని ప్రయత్నించిన కేసులో నిందితులు కొండూరి శ్రీనివాస్, మాడక వర్షిత్ కుమార్ అలియాస్ బంటి, జగదీష్‌ఠాకూర్ అలియాస్ జగ్గును మంగళవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి ఎనిమిది మందిపై చీటింగ్ కేసు నమోద కాగా ముగ్గురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం విచారణ కొనసాగుతోందని తెలిపారు. కోర్టు ఆదేశాలతో నిందితులను జైలుకు తరలించామని పేర్కొన్నారు.

గోదావరిఖనిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కోల్‌సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అశోక్‌నగర్‌లో నివాసముండే ఇంటర్ విద్యార్థిని కాంపెల్లి అక్షర(17) మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అక్షర ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షర ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనకు కారణాలు తెలియరాలేదు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

గంభీరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఈనెల 21న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువ రైతు రాయలింగు సతీష్(35) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన సతీష్ తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పంట దిగుబడి తగ్గడంతో పోషణ భారంగా మారింది. దాంతో ఎనిమిది నెలల కిందట రూ.8 లక్షలు రుణం తీసుకుని వరి కోత యంత్రం కొనుగోలు చేశాడు. యాసంగి సీజన్‌లో రూ. లక్ష బాకీలు చేసి పంటను వేశాడు. నీరు లేక పంట ఎండిపోయి చేతికందకుండాపోయింది. మూడు నెలల కిందట రూ.లక్ష అప్పులు చేసి బోరు వేయించాడు. ఓ వైపు బాకీల బాధలు.. మరో వైపు కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్థాపం చెందిన సతీష్ ఈనెల 21న పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు

● ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రవాణా

తిమ్మాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మట్టి, మొరం అవసరం మేరకు అనుమతి తీసుకొని రవాణా చేసుకునే వెలుసుబాటు కల్పించింది. తిమ్మాపూర్ మండలంలో దీన్ని కొందరు అసారాగా చేసుకొని ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇష్టరాజ్యంగా మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రాత్రి వేళ టిప్పర్లతో మొరం డంపులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 నుంచి 5గంటల వరకే అనుమతి తీసుకున్న చోటు నుంచి మొరం తరలించాలి. కానీ కొందరు అక్రమార్కులు రాత్రి వేళల్లో టిప్పర్లతో మొరం తరలిస్తూ డంపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పగలు ట్రాక్టర్లతో మొరం, మట్టి విక్రయిస్తున్నారు. ఎవరైనా అడిగితే ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నామని చెపుతున్నారు.

దిగువ మానేరు జలాశయం నుంచి ప్రస్తుతం కరీంనగర్‌లోని మానేర్ రివర్ ఫ్రంట్‌కు రెండు లక్షల క్యూబిక్ మీటర్లు, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని మోయతుమ్మెద వాగులోకి పూడికతీత పనులకు 10వేల క్యూబిక్ మీటర్ల మొరం తవ్వుకునేందుకు ఇరిగేషన్ శాఖ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌లకు అనుమతి ఇచ్చింది. మొరం తవ్వకాలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో మొరం టిప్పర్ల ద్వారా పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయంలో దిగుమ మానేరు జలాశయం నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఖాళీ ప్రదేశాలలో డంపులుగా నిల్వ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా డ్యామ్ కట్ట పరిసరాలల్లో ఇష్ట రీతిలో తవ్వకాలు జరుపుతుండటంతో డ్యాం లోపల పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది.

పట్టించుకోని అధికారులు

రాత్రింబవళ్లు మొరం తరలిస్తున్నా, జనావాసాల మధ్య బారీగా మొరం డంపులు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మట్టి ట్రాక్టర్లు రోడ్డుపైనే యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకొనే వారు లేకుండా పోయారు. ప్రభుత్వ ఖజానకు గండి కొడుతూ డ్యాం, ఇతర ప్రదేశాల నుంచి తరులుతున్న మొరంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను సప్రదించగా రాత్రి సమయంలో మొరం అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని అంటిదేమైనా ఉంటే నిఘా పెట్టి వాటిని పట్టుకొని వారిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.



అలుగునూర్ మానేరునగర్‌లో నిల్వ చేసిన మొరం, మట్టి



ఎల్ఎండీలోని ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో డంప్ నుంచి తరలిస్తున్న మొరం

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లపాపలను, పాడిపంటలను చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు ఆలయంలోకి చేరుకుని అమ్మవారికి పట్నాలువేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థిని

రాయికల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.అనూష షాట్‌పుట్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జగిత్యాల జిల్లాలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పొరండ్ల కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పీడీ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు అభినందించారు.

మిర్చి నారు C/O ఉప్పట్ల



- గతంలో ఏపీలోని గుంటూరు నుంచి కొనుగోలు
- రైతులకు వ్యయప్రయాసలు
- నారు సాగుతో పలువురికి ఉపాధి

మంథనిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో మిర్చి పంటను సాగు చేస్తారు. గతంలో ఇక్కడి రైతులు ఆంధ్ర ప్రాంతంలోని గుంటూరు వెళ్ళి మిర్చి నారు తీసుకు వచ్చి ఇక్కడ సాగు చేసేవారు. గుంటూరు వెళ్ళి నారు తెచ్చుకోవడం వ్యయప్రయాస కావడంతో ఇక్కడే నారు తయారీ చేస్తున్నాడు మండలంలోని ఉప్పట్లకు చెందిన పోగుల తిరుపతి అనే రైతు. ఇరవై సంవత్సరాలుగా మిర్చి పంట సాగు చేస్తున్న తిరుపతి నారు కోసం రైతులు పడుతున్న కష్టాలు చూశాడు. రవాణా, ఆర్థిక భారం తగ్గించాలని ఆలోచన చేసి మిర్చి నారు పెంపకం పై దృష్టి పెట్టాడు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన పోతారం, గుంజపడుగు, మిలోచవరం గ్రామాలలో రైతులు మిర్చి పంట అధికంగా సాగు చేస్తారు. రైతులకు రవాణా ఖర్చులతో పాటు, మిర్చినారుకు అధిక డబ్బులు అవడం, తీసుకు వచ్చినా నారు పాడై పోతుండటంతో ఇక్కడే నారు పెంచడం ప్రారంభించాడు. మిర్చి సాగు చేసే రైతులు విత్తనాలు తీసుక వస్తే వాటిని అలికి నారు అయ్యే వరకు పెంచుతాడు. ఇందుకు ప్యాకెట్‌కు రూ.350 నుంచి 400ల చొప్పున డబ్బులు తీసుకుంటాడు. సుమారు 45 నుంచి 50 రోజుల వరకు మిర్చినారు నాటే స్థాయికి వస్తుంది. ఇలా విత్తనాలను అలికి నారును ఇస్తుండటంతో రైతులకు ఉపయోగకరంగా ఉంది. ఉప్పట్లలోనే నారు లభిస్తుండడంతో రైతులకు భారం తగ్గింది. దీంతో పాటు నాణ్యమైన విత్తనాలను ఎంచుకునే అవకాశం లభించింది. గతంలో గుంటూరు నుంచి తీసుకు వచ్చిన నారు ఎలాంటిదో తెలియక రైతులు అనేక సార్లు నష్టపోయిన సందర్భాలున్నాయి. మిర్చి నారు పెంచుతున్న తిరుపతితో పాటు 10 నుంచి 15 మంది కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

ఈ సంవత్సర పంటకు నారు సిద్ధం చేస్తున్న..



- పోగుల తిరుపతి, రైతు ఉప్పట్ల

ఈ సంవత్సరం వారం, పది రోజులలో మిర్చి నాట్లు ప్రారంభమవుతాయి. ఇందుకు రైతుల కోసం వంద ఎకరాలకు సరిపడే మిర్చి నారు సిద్ధం చేస్తున్న. ఆరు సంవత్సరాలుగా రైతుల కోసం మిర్చి నారు పెంచుతున్నా. రైతులు తమకు ఇష్టమైన విత్తనాలు తీసుకవస్తే అలికి నారు సిద్ధం చేసి ఇస్తా. నాతో పాటు మరి కొందరు కూలీలు ఉపాధి పొందుతున్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

భగత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలు పరిష్కరించిందని ఆర్టీసీ కార్మికులు మంగళవారం కరీంనగర్-2 డిపో ఎదుట సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. 2017 పే స్కేలు, 2013 బాండ్ డబ్బులు, డీఏలు, సీసీఎస్ రుణాల డబ్బుల చెల్లించడంతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి టీఆర్ రెడ్డి, రీజినల్ అధ్యక్షుడు ఎన్‌కే రాజు, నాయకులు ఖాద్రీ, రజనీకుమార్, ఖలీం, సంపత్, శ్రీధర్, కెఆర్‌రెడ్డి, శేఖర్, రిటైర్డ్ ఉద్యోగులు ఇసాక్, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు

భగత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు మంగళవారం అధికారులు ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌లుగా వేములవాడ, హుజూరాబాద్ ఎంపికయ్యాయి. 2024-25, 2025-26 సంవత్సరానికి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన 26 మందికి కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, పి.మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.శ్రీనివాస్, ఎం.రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.శంకరయ్య, బి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ

- ఏడుగురికి స్వల్ప గాయాలు

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో మంగళవారం రాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో సిరిసిల్లకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో బస్సు డ్రైవర్ దుబ్బాకకు చెందిన తలారి స్వామితో పాటు ఆరుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ మొగిలి, ఎస్‌ఐ ఉపేంద్ర చారి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురి బైండోవర్

కథలాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని చింతకుంటలో అటవీ శాఖకు చెందిన ఎకరం భూమిలో చెట్టు నరికివేసి బ్లేడ్ ట్రాక్టర్లతో ధ్వంసం చేసిన ఐదుగురిని సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఫారెస్ట్ సెక్షన్ అధికారి ముస్తాక్ అలీ తెలిపారు. సూరి వెంకటేశ్, లావుడ్య రాజేశ్, లావుడ్య రమేశ్, బోదాసు రాజు అనే వ్యక్తులు మూడు బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రాజన్న ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆగమశాస్త్ర ఆధారంగా ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మంగళవారం ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులపై ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి వివరించగా, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ వెంకటరావు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి ప్రణాళికను భక్తులకు, ప్రముఖులకు పారదర్శకంగా తెలియజేశామన్నారు. రాబోయే రోజులలో పెరిగే భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి ప్రణాళికలను డీజీపీఎస్, డ్రోన్ సర్వే ఆధారంగా తయారు చేశామని తెలిపారు. మహాశివరాత్రి, సమ్మక్క సారలమ్మ జాతర వంటి సమయాల్లో పార్కింగ్ సమస్య ఉత్పన్నం కాకుండా జగిత్యాల రోడ్డు వైపు 20 ఎకరాలు ముందుగానే గుర్తించి పెట్టామన్నారు. చారిత్రాత్మక ప్రాధాన్యత, పౌరాణిక ప్రాధాన్యత ఉన్న ఉప ఆలయాలు యధావిధిగా కొనసాగుతాయని, ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను ఆగమశాస్త్రం ప్రకారం చేపడుతాని, శృంగేరి పీఠం అనుమతితో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పక్కా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఆలయ విస్తరణ 4 నుంచి 6 ఎకరాలలో ఉంటుందని, మాస్టర్ ప్లాన్ డెవలప్‌మెంట్ ఏరియా 33 ఎకరాల వరకు ఉంటుందన్నారు. ఆలయ విస్తరణలో షాపులు కోల్పోయే వారికి భవిష్యత్తులో కేటాయించేందుకు హరిహర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.110 కోట్లకు టెండర్లు పిలిచామని, వీటిలో ఆలయ విస్తరణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత కింద రూ.76 కోట్లు, అన్నదాన సత్రం నిర్మాణానికి రూ.35 కోట్లు కేటాయించాన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెండవ విడత రూ.285 కోట్లు కేటాయిస్తామన్నారు. అనంతరం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం ప్రణాళికను తెలియజేస్తూ ప్రజలకు ఉన్న సందేహాలు అపోహలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, దేవాదాయ శాఖ సలహాదారు గోవింద్‌హరి, ఆలయ ఇన్‌చార్జి ఈవో రాధాబాయి, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్



ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్ వివరిస్తున్న ఆర్కిటెక్ట్

దర్గా బయటకు మార్చేందుకు ఆలోచన చేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ

వేమలవాడ రాజరాజేశ్వర స్వామివారి శైవక్షేత్రంలో ఉన్న దర్గాను ఆలయం బయటవైపు మార్చేందుకు మరోమారు ఆలోచన చేయాలని అధికారులను బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కోటిలింగాలను వేరే చోటుకు మార్చే విధంగానే ఆలయంలో ఇరుకుగా ఉన్న దర్గాకు కొంత స్థలం కేటాయించి బడ్జెట్ పెట్టి ఆలయం బయట ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్ దృష్టికి తీసుకువెళ్లారు.

33 ఎకరాల్లో రాజన్న ఆలయ అభివృద్ధి

- మాస్టర్ ప్లాన్, నమూనా చిత్రాలతో వివరించిన ఆర్కిటెక్ట్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మొదటి దశ అభివృద్ధి పనులపై మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్, నమూనా చిత్రాలను చూపిస్తూ పట్టణ ప్రజలకు ఆయా పార్టీల నాయకులకు వివరించారు. ప్రస్తుతం రాజన్న ఆలయ 4 నుంచి 6 ఎకరాల విస్తరణంలో ఉండగా సుమారు 33 ఎకరాల్లో రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం నాలుగు గోపురాలతో 540 ఫీట్ల పొడవు, 37 ఫీట్లతో ప్రాకారాలు నిర్మించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవీ స్టేషన్(భక్తుల పికప్‌డ్రాప్), అన్నదానం, ప్రసాదం తయారీ కేంద్రం, వీఐపీ గెస్ట్‌హౌస్, శివార్చన వేదిక, కల్యాణకట్ట, నూతనంగా నిర్మించే భక్త ధర్మగుండంతో పాటు పలు కట్టడాలను నిర్మిస్తున్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

వేములవాడ రాజన్న ఆలయంలో ప్రముఖుల పూజలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అభివృద్ధిపై జరిగిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ, స్తపతివల్లి నాయగం, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో రాధాబాయి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్, శైలజా రామయ్యర్, కలెక్టర్

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు తరలిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి కిక్ బాక్సింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో సత్తాచాటడానికి మంగళవారం తరలివెళ్లారు. గత నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు శివేష్, అనంద్, యుతిక, స్వేదిక, అజాన్ ఎంపికైన్నారు. బుధవారం నుంచి ఆదివారం వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నై నెహ్రూ స్టేడియంలో జరగనున్న జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐదుగురు క్రీడాకారులు తరలివెళ్లారు.



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు వదులుతున్నారు.

రామడుగు : రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి ఒక్క పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీరు గ్రావిటీ కెనాల్‌కు వెళ్తోంది.

మిడ్ మానేరులోకి..

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 16,800, గాయత్రి పంప్ హౌస్ నుంచి 3150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఎల్‌ఎండికి ఆరు గేట్లను మీటరు పైకెత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 17.683 టీఎంసీల నీరు ఉంది.

ఎల్‌ఎండీలోకి...

తిమ్మాపూర్ : ఎల్‌ఎండీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 10.689 టిఎంసీలకు చేరింది.

అన్నపూర్ణలోకి ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

సెప్టెంబర్ 15లోగా చీరల ఉత్పత్తి ఆర్డర్ పూర్తి చేయాలి

- చేనేత జౌళీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్



మాట్లాడుతున్న చేనేత జౌళీ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యార్



కార్యక్రమంలో పాల్గొన్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించిన చీరల ఉత్పత్తి ఆర్డర్‌ను సెప్టెంబరు 15వ తేదీలోగా పూర్తిచేయాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ సూచించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అందజేసే ఏకరూప చీరల ఉత్పత్తిపై మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన బాధ్యులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ బాధ్యులకు కేటాయించిన ఆర్డర్, వారు ఉత్పత్తి చేసిన అంశాలపై చర్చించారు. ఉత్పత్తిలో చాలా వెనుకబడిన వారి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం శైలజారామయ్యార్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు ఏకరూప చీరలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ చీరల ఉత్పత్తి ఆర్డర్‌లో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ కేటాయించామని వివరించారు. 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, ఇప్పటి దాకా దాదాపు 50 శాతం పూర్తి అయిందని వెల్లడించారు. మిగతా ఆర్డర్‌ను వచ్చేనెల 15వ తేదీలోగా ఇవ్వాలని స్పష్టం చేశారు. దానికి అనుగుణంగా పరిశ్రమ బాధ్యులు పవర్ లూమ్‌లు, కార్మికులు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసుకొని, ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఉత్పత్తిలో వెనుక బడిన వారు తమ ఆర్డర్ పూర్తి చేయని పరిస్థితుల్లో మిగతావారికి దానిని అందిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమ బాధ్యుల వద్ద ఉన్న వస్త్రాన్ని వెంటనే గోదాముకు తరలించాలని సూచించారు. దీంతో మిగతా ప్రక్రియ వేగంగా పూర్తి అవుతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా చీరలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిరంతరం ప్రభుత్వ ఆర్డర్లు అందించేందుకు సర్కార్ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలోని యంత్రాలను ఆధునికీకరించాలని పేర్కొన్నారు. దీంతో మార్కెట్‌తో పోటీ పడే అవకాశం ఉంటుందని, మరిన్ని ఆర్డర్లు వస్తాయని తెలిపారు. వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఆలోచన చేయాలని సూచించారు. వస్త్ర పరిశ్రమ ఆర్డర్లకు సంబంధించిన బిల్లులు త్వరలోనే అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, జీఎస్టీ తదితర సమస్యలను పరిశ్రమ బాధ్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో టెస్కో సీజీఎం ఎన్‌వీ రావు, చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, అధికారులు పాల్గొన్నారు.

జనహితయాత్రకు తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ చేపట్టిన జనహితయాత్రకు రాజకీయాలకతీతంగా ప్రజలు తరలివచ్చారని, వారందరికీ పాదాభివందనం చేస్తున్నానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఆరు గ్యారంటీలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజప్రభుత్వంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సన్న బియ్యం, ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్, వరికి రూ.500 బోనస్, 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా, 25 లక్షల రైతు =లకు 21 కోట్ల రూపాయల రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డులను అందించి రికార్డు సృష్టించిందన్నారు. ఒక్క వ్యవసాయానికే లక్షా 2 వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల, రైతుల పక్షపాతిగా పాలన సాగిస్తుందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిపనులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేశారని అన్నారు. స్వచ్ఛందంగా వేలాది ప్రజలు తరలి వచ్చి మద్దతు పలికినందుకు వారికి తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిచ్చినా తక్కువేనన్నారు. తాను బతికున్నంత వరకు నియోజకవర్గ ప్రజలకు సోదరుడిగా అండగా ఉంటానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు, రవీందర్, రాజిరెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

యూరియా కోసం రైతుల ఆందోళన


తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో రోడ్డుపై బైఠాయించిన రైతులు


అల్మాస్‌పూర్‌లో గుమికూడిన రైతులు


కందికట్కూర్‌లో బారులు తీరిన రైతులు

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ పరిధిలోని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ప్యాక్స్ గోదాంకు 200 యూరియా బ్యాగులు వచ్చాయని తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. సరిపడా యూరియా బ్యాగులు లేకపోవడంతో ఆగ్రహానికి గురైన రైతులు సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. సీఐ మొగిలి, ఎస్ఐ ఉపేంద్రచారి, వ్యవసాయ శాఖ అధికారి సంజీవ్ చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అలాగే తంగళ్లపల్లిలో ఫర్టిలైజర్ షాప్ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు.

● ఎల్లారెడ్డిపేట : పల్లెల్లో యూరియా కోసం అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేవు. వేకువజాము నుంచి ప్యాక్స్ గోదాంలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని రాచర్లబొప్పాపూర్, అల్మాస్‌పూర్, బంజేరుతండాల్లో మంగళవారం రైతులు బారులు తీరారు. ఎరువు కోసం ఎగబడ్డారు. అల్మాస్‌పూర్‌లో లారీలో వచ్చిన యూరియా బస్తాలను కొన్ని రైతులకు అందించి వేరే గ్రామానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. దాంతో రైతులు ఆగ్రహించారు. లారీకి అడ్డుగా నిలబడి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఏవో రాజశేఖర్ అక్కడకు చేరుకున్నారు. వరి నాటు వేసి నెల రోజులు గడుస్తున్నా యూరియా సరఫరాలో నిర్లక్ష్యంపై నిలదీశారు. వాగ్వివాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు చేరుకుని శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. వచ్చిన యూరియా మొత్తం తమకే అందించాలని పట్టుబట్టారు. ప్రతి రైతుకు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. రాచర్లబొప్పాపూర్, బంజేరుతండా గ్రామాల్లో రైతుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. గంటల తరబడి నిరీక్షిస్తేనే.. ఒక బస్తా యూరియా దొరుకుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల విక్రయకేంద్రానికి 225 యూరియా బస్తాలు, రేపాక గ్రామంలోని ప్రైవేట్ వ్యాపారికి 225 బస్తాలు వచ్చాయి. కందికట్కూర్ గ్రామంలోని విక్రయకేంద్రం వద్ద ఉదయం 5గంటలకే రైతులు క్యూలో నిలబడ్డారు.రైతులు ఎక్కువమంది రావడం యూరియా బస్తాలు తక్కువగా రావడంతో పోలీసుల సహకారంతో పంపిణీ చేశారు. మిగతా రైతులకు టోకెన్లు అందించారు.

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

కోనరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తి హర్షనీయమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల ఆకాంక్షకు కుల వృత్తులందరిని కలుపుకొని వారి అభివృద్ధి కోసం పోరాటం చేసిన వ్యక్తి సర్వాయి పాపన్న అని కొనియాడారు. సర్వాయి పాపన్న చరిత్ర భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా ఆయన విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ హైదరాబాద్ నడిబొడ్డున భూమి పూజ చేశారన్నారు. ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో ప్రభుత్వం ప్రజా పాలనను కొనసాగిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, గౌడ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, అబ్బసాని శంకర్‌గౌడ్, తాళ్లపెల్లి శ్రీకాంత్, సతీష్, నందుగౌడ్, చంద్రయ్య గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, వెంగలి వెంకన్న, శ్రీనివాస్ రెడ్డితో పాటు గౌడ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

విగ్రహావిష్కరణలో బీజేపీ నేతలు

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణలో బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, మండల అధ్యక్షుడు బాలాజీ, పల్లం అన్నపూర్ణ, తీగల రవీందర్‌గౌడ్, మోత్కు మోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రావయ్యా.. గణపయ్యా..

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే సేకరించారు. వినాయక ఉత్సవాల ప్రారంభం నుంచి చివరివరకు ప్రత్యేక దృష్టిని పెడుతున్నారు. ఇప్పటికే నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజు కూడా క్రమపద్ధతిలో వెళ్లడానికి ముందుగానే సీరియల్ నంబర్లను కేటాయిస్తున్నారు. సంప్రాదాయ పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవడానికి సూచనలు చేస్తున్నారు. గణేష్ మండపాలను ప్రజారవాణా, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపాలు ఏర్పాటు చేసేవారు సంబంధిత శాఖల అనుమతి, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద 24 గంటలు వలంటీర్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. డీజేలు కాకుండా చిన్న స్పీకర్‌లను పోలీసుల అనుమతితో ఏర్పాటు చేసుకోవాలి. మండపాల వద్ద ఏమైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచనలు చేశారు.

అక్టోబరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం అంజన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు రానున్న అక్టోబరులోగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ దేవాలయం వద్ద రూ.31లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్మాణాల విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట పంచాయతీరాజ్ శాఖ డీఈ విష్ణువర్ధన్, ఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

ఇల్లంతకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేయడానికి చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతానికి మంగళవారం చేరుకున్న నాయకులు బండి సంజయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి మాట్లాడుతూ బీజేపీ నాయకులు చేసిన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడిన ప్రతిమాట నిజమే అన్నారు. బీజేపీ నాయకులు ఎన్నికలలో ఏ విధంగా గెలుస్తారో ప్రజలందరికి తెలుసన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఎలగందుల ప్రసాద్, మండలకాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి బాలపోచయ్య, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు మచ్చ రాజేశం, జమాల్, విజయ్, జెట్టి మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, ఎలుక అనీల్, కాసుపాక రమేష్, నగేష్, ముజాఫర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు ఎదుట కార్మికుల ధర్నా..


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు తమ డిమాండ్లను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ ధర్నకు దిగారు. తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు కార్మికులు కూలి పెంపు కోసం చేస్తున్న సమ్మె 8వ రోజుకు చేరుకుంది. దీంట్లో భాగంగా మంగళవారం పార్కు ప్రధాన ద్వారం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్కు మందు నుంచే మంత్రి కాన్వాయ్ వెళ్తుండడంతో కార్మికులు రోడ్డుపైకి రాకుండా భారీగా పోలీసులను ఏర్పాటు చేశారు. మరోవైపు కార్మికులు తమ డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ 8వ తేదిన కార్మికులతో చర్చించి కూలీ పెంచుతామని యజమానులు అధికారుల సమక్షంలో ఇచ్చిన మాటను తప్పారని ఆరోపించారు. యజమానులు ప్రభుత్వ ఆర్డర్ సోషల్ వెల్ఫేర్ వస్త్రానికి మీటరుకు సుమారు రూ.20 లాభం తీసుకుంటున్నప్పటికి కార్మికులకు కూలి పెంచడం లేదన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. సిరిసిల్లలో చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, జెల్ల సదానందం, కిషన్, శ్రీకాంత్, సంపత్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి


ఎల్లారెడ్డిపేటలో మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న సీఐ


ఇల్లంతకుంటలో మట్టి విగ్రహాలతో విద్యార్థులు


వేములవాడలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ప్రతాప రామకృష్ణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను పూజించి ప్రకృతిని కాపాడాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు నిర్వాహకుల ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ రెడ్డి, నిర్వాహకులు ప్రేమ్‌కుమార్, లక్ష్మణ్, నాయకులు రాజేశం, నాగరాజు, నవీన్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మట్టి వినాయ కులను తయారుచేసి ప్రదర్శించారు. అలాగే చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు రగుడు, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, సర్ధాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అంబటి రవీందర్, ఉపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగరం మాధవి, లకవత్ ఉమా, బైరి శ్రీవాణి, కడార్ల కల్పన, నాగుల వీణా, నందాల శంకర్, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

● ఇల్లంతకుంట : మట్టివిగ్రహాలను పూజిద్దామంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండలకేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం మట్టి తయారుచేసిన విగ్రహాలను పట్టుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్‌ఆఫ్ ప్యారీస్ తయారుచేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసి నీటిని త్రాగడం వల్ల పశువులు అనార్యోగానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. భారత్‌గ్యాస్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, భారత్‌గ్యాస్ యజమాని నలుమాచు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలకేంద్రంలో శుభోదయం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవిలత రెడ్డి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జీ పద్మశ్రీ, పీఈటీ అజయ్‌కుమార్, మమత, శ్రీనివాస్, అనిల్, అకాడమిక్ ఇన్‌చార్జీ సాయి ప్రియ, ధనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ సమీపంలోని గణేష్ మండపం వద్ద సుమారు 500 మట్టి గణపతులను బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ ఉచితంగా పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, కార్యకర్తలు తదిత రులు ఉన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం జోగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చెరువు నుంచి మట్టిని సేకరించి, ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య పర్యవేక్షణలో మట్టి విగ్రహాలను తయారుచేశారు. ఉపాధ్యాయుడు అంజయ్య విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు, ఉపాధ్యాయులు మహేశ్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య పాల్గొన్నారు.

● సిరిసిల్ల : జిల్లా కేంద్రంలో మంగళవారం మానేరు స్వచ్ఛంద సంస్థ, సంతోష్ ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ వర్క్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, కాంగ్రెస్ నాయకుడు శివప్రసాద్, ప్రతినిధులు నారాయణ, దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.


తంగళ్లపల్లిలో వినాయకుడి ఆకృతిలో విద్యార్థులు..

రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషాకు ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు సోమిశెట్టి దశరథం లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం విద్యానగర్ నుంచి తాడూరు గ్రామానికి వెళ్లే లే అవుట్ 33.6 పిట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని ఆరోపించారు. 1984లో చేసిన వెంచర్లో 33.6 ఫిట్ల రోడ్డును లే అవుట్ కింది వదిలేయడం జరిగిందన్నారు. ఆ రోడ్డును ఆక్రమించుకొని భవనాలను నిర్మించారని ఆరోపించారు. ఆక్రమణ భవన నిర్మాణంపై అధికారులు సర్వే చేపట్టి 33.6 ఫిట్ల రోడ్డుకు హద్దులను పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తడక రాములు, గుజ్జె దేవదాస్ పాల్గొన్నారు.

ఎంపిక

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంకు చెందిన బదావత్ మదన్ యువ తెలంగాణ ప్రోకబడ్డీ ఛాంపీయన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు మల్లారెడ్డి, సింగారం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్‌రావు తదితరులు మదన్‌ను అభినందించారు. ఈనెల 28 నుంచి జరిగే పోటీలకు టెక్నికల్ ఆఫీషల్‌గా మదన్ వ్యవహరించనున్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

రుద్రంగి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోండ్ల సత్యం, గండి నారాయణ, డీజే హరీష్, బోయిని రాజు, గండి అశోక్, బోయిని చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఇల్లంతకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే మహిళా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు దివ్య, పూజిత, అశ్రీత, వసుందర, శ్రేయ, దివ్యతరుణి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అభివృద్ధిని వివరించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని వీర్నపల్లి మండలం మద్దిమల్ల ఎంపీటీసీ క్లస్టర్ ఇన్‌చార్జి, సిరిసిల్ల 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మద్దిమల్ల ఎంపీటీసీ క్లస్టర్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. సమావేశంలో నాయకులు సురేశ్‌నాయక్, చాంద్‌పాషా, సుదర్శన్, సంతోష్, రఫీక్, రవి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా


తిలకిస్తున్న ఎంఈవో గంగారం, ఉపాధ్యాయులు

గంభీరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ ప్రాంగణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు)లో మంగళవారం నిర్వహించిన టీఎల్ఎం మేళా ఆకట్టుకుంది. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారుచేసిన తెలుగు, ఆంగ్లం గణితం, సామాన్యశాస్త్రం విభాగాలకు సంబంధించిన బోధనోపకరాలను ప్రదర్శించారు. ఎంఈవో గంగారాం, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తిలకించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన పాఠశాలలు జిల్లా స్థాయిలో పాల్గొంటాయని ఎంఈవో గంగారాం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల మేళాలను మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసి ప్రదర్శించారు. ఆకట్టుకునేలా.. అవగాహన కలిగించేలా.. రూపొందించిన ప్రదర్శనలను సెస్ డైరెక్టర్ మల్లేశం, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్‌లు తిలకించారు. విద్యార్థులు కనీస అభ్యాసన స్థాయిలు సాధించేలా బోధనాభ్యసన సామగ్రి ఎంతగానో దోహదం చేస్తాయని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. 10 ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు బెస్త రాజశేఖర్ తల్లి లక్ష్మీ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు చాంద్‌పాషా. సురేశ్‌నాయక్, రవి, శ్రీరాంనాయక్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట దహనం చేసిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి పాటుపడాల్సిందీ పోయి దిష్టిబొమ్మను దహనం చేయడం సరి కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, బాబు, బుచ్చాగౌడ్, గిరిధర్‌రెడ్డి, లక్ష్మీ, బాల్‌రెడ్డి, గోపాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీకి యత్నం

కోనరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాటిపెల్లి కాంతవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. కాంతవ్వ వారం రోజుల క్రితం కూతురు ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇల్లు తాళం పగులగొట్టి ఉండేసరికి గ్రామస్థులకు సమాచారం అందించింది. ఇంట్లో వస్తువులు ఏమీ పోలేదని గ్రామస్తులు తెలిపారు. వృద్ధురాలి మనవడు కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు

చందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులు ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి తనిఖీ సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలపై, త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలపై పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని, విజిబుల్ పోలీసింగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలన్నారు. గ్రామ పోలీస్ అధికారులు గ్రామాలలోని వినాయక మండపాలను తరచూ సందర్శిస్తూ, పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. గొడవలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని వినాయక మండప నిర్వాహకులు కూడా పోలీస్ శాఖతో సహకరించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని కోరారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.